ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
బుధవారం
12 మార్చి
2025




# అట్టహాసంగా అష్టోత్తర శతఘటాభిషేకం, డోలోత్సవం

**అష్టోత్తర శతఘటాభిషేకం, శృంగార డోలోత్సవంతో ముగిసిన బ్రహ్మోత్సవాలు**

**ఈ నెల 1 నుండి 11 వరకు జరిగిన బ్రహ్మోత్సవాలు**

**నేటి నుండి ఆర్జిత సేవలు పునరుద్ధరణ**

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాయి. మంగళవారం నిర్వహించిన అష్టోత్తర శతఘటాభిషేకం, శృంగార డోలోత్సవంతో బ్రహ్మోత్సవాలకు అర్చకులు పరిసమాప్తి పలికారు. ఈ నెల 1న మొదలైన బ్రహ్మోత్సవాలు 11 వరకు.. 11 రోజుల పాటు ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. 1న స్వస్తివాచనంతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టిన అర్చకులు.. మంగళవారం రాత్రి చేపట్టిన శృంగార డోలోత్సవంతో ముగింపు పలికారు.

### అట్టహాసంగా అష్టోత్తర శతఘటాభిషేకం, శృంగార డోలోత్సవం

బ్రహ్మోత్సవాలలో చివరి రోజైన మంగళవారం ప్రధానాలయంలో నిర్వహించిన అష్టోత్తర శతఘటాభిషేకం, శృంగార డోలోత్సవం కైంకర్యాలను ఆలయ ప్రధానార్చకులు నల్లంథీఘల్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యుల అర్చకత్వంలో అర్చకులు అట్టహాసంగా నిర్వహించారు. ఉదయం 10 గంటలకు ప్రధానాలయంలో నిర్వహించిన అష్టోత్తర శతఘటాభిషేకం ఉత్సవంలో భాగంగా.. ప్రధానాలయ ముఖ మంటపంలో, గర్భగుడికి అభిముఖంగా, స్వర్ణ ధ్వజస్తంభానికి ఎదురుగా 108 వెండి కలశాలను వరుసగా పేర్చి వేదపండితుల మంత్రోచ్చారణలు, పారాయణీకుల పారాయణాలు, యాజ్ఞీకులు, రుత్వికుల మూలమంత్ర, మూర్తిమంత్ర హోమాలు, జపాల మధ్య, మంగళ వాయిద్యాల హోరు నడుమ కలశాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 108 కలశాల్లో ఉన్న మంత్రజలంతో స్వామివారికి అర్చనాభిషేకాలు నిర్వహించారు. అనంతరం మంత్ర జలాన్ని భక్తులపై చల్లి సంప్రోక్షణ చేశారు. సాయంత్రం ఆలయంలో స్వామివారికి నిత్య ఆరాధనలు ముగిసిన తర్వాత.. రాత్రి 9 గంటలకు స్వామివారికి శృంగార డోలోత్సవాన్ని అర్చకులు ఘనంగా జరిపారు. ఉయ్యాలలో శయనించిన లక్ష్మీసమేత నారసింహులను దర్శించుకోవడం వల్ల భక్తులకు సర్వదోషాలు తొలగి, ఆనందమైన జీవితం ప్రాప్తిస్తుందని అర్చకులు వివరించారు. మంగళవారం నిర్వహించిన అష్టోత్తర శతఘటాభిషేకం, శృంగార డోలోత్సవంతో నరసింహుడి వార్షిక బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం అయ్యాయని ప్రధానార్చకులు నల్లంథీగల్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యులు తెలిపారు. బ్రహ్మోత్సవాలు విజయవంతంగా ముగియడానికి సహకరించిన అర్చక బృందం, వేదపండితులు, పారాయణికులు, రుత్వికులు, టెంపుల్ స్టాఫ్, పోలీసులు, జర్నలిస్టులను సన్మానించి స్వామివారి ప్రసాదం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఉత్సవాల్లో జిల్లా కలెక్టర్ హనుమంతరావు, టెంపుల్ చైర్మన్ నరసింహమూర్తి, ఈవో భాస్కర్ రావు, డిప్యూటీ ఈవో దోర్బల భాస్కర్ శర్మ, ఏఈవోలు గజవెల్లి రఘు, రమేష్ బాబు, నవీన్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### నేటి నుండి ఆర్జిత సేవలు షురూ

బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో ఈ నెల 1 నుండి 11 వరకు.. 11 రోజుల పాటు తాత్కాలికంగా రద్దు చేయబడిన స్వామివారి ఆర్జిత సేవలు, నిత్య, శాశ్వత, మొక్కు కల్యాణాలు, సుదర్శన నారసింహ హోమం, బ్రహ్మోత్సవం పూజలు బుధవారం నుండి పునరుద్ధరింపబడనున్నాయి. నేటి నుండి స్వామివారికి నిర్వహించే అన్ని రకాల పూజలు తిరిగి ప్రారంభం కానున్నాయని ఆలయ ఆఫీసర్లు తెలిపారు.



శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారికి అభిషేకం నిర్వహించేందుకు మహా కలశాన్ని తీసుకువస్తున్న ప్రధానార్చకులు లక్ష్మీ నరసింహ చార్యులు.



యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావుకు సంకల్పం చేస్తున్న ప్రధానార్చకులు నల్లన్ దీగల్ లక్ష్మీ నరసింహ చార్యులు



యాదగిరిగుట్ట దేవస్థానం కార్యనిర్వహణాధికారి అడిషనల్ కలెక్టర్ ఏపూరి భాస్కరరావుకు సంకల్పం నిర్వహిస్తున్న అర్చకులు.



ఆలయంలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న యాగ్నీకులు కిరణాచార్యులు కార్యక్రమంలో పాల్గొన్న ఈవో భాస్కర్ రావు.



యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాలలో మంగళవారం రాత్రి శృంగార డోలోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు.



శృంగార డోలోత్సవం సందర్భంగా హరికథాగానం చేస్తున్న దృశ్యం.

# యాదగిరిగుట్ట టెంపుల్‌కు రెండు ఐఎస్ఓ సర్టిఫికేట్లు

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: తెలంగాణలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానానికి అరుదైన గుర్తింపు లభించింది. అత్యున్నత ప్రమాణాలు పాటించినందుకు ఒక గుర్తింపు, ప్రసాద తయారీలో నాణ్యత, భద్రతా పరమైన విషయాల్లో అవలంభిస్తున్న ప్రమాణాలకుగానూ మరో గుర్తింపు లభించింది. ఇందులో అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన ఆలయంగా యాదగిరిగుట్టకు 2018లో ఐఎస్ఓ సర్టిఫికేట్(ISO 9001:2015) ఇచ్చింది. ఆ సర్టిఫికేట్ ను మళ్లీ రెన్యూవల్ చేస్తూ మంగళవారం ఆలయానికి మళ్లీ సర్టిఫికేట్ అందజేసింది. అదేవిధంగా ప్రసాదాల తయారీ, పాటిస్తున్న నాణ్యతా ప్రమాణాలను పరిశీలించిన హెచ్వైఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేట్ సంస్థ ప్రతినిధులు.. ఐఎస్ఓ సర్టిఫికేట్ కోసం ఉండాల్సిన స్టాండర్డ్స్ అన్నీ పాటిస్తున్నారని ఐఎస్ఓ(ఇంటర్నేషనల్ స్టాండర్డైజేషన్ ఆర్గనైజేషన్) కు నివేదిక సమర్పించారు. దీనిపై సంతృప్తి వ్యక్తం చేసిన ఐఎస్ఓ ఆలయానికి ISO 22000:2018 సర్టిఫికేట్ జారీ చేసింది. దీంతో రెండు ఐఎస్ఓ సర్టిఫికేట్లు పొందిన ఏకైక ఆలయంగా యాదగిరి దేవస్థానం చరిత్ర పుటల్లోకి ఎక్కింది. ఈ రెండు సర్టిఫికేట్లను మంగళవారం ఎండోమెంట్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ కు హెచ్వైఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేట్ సంస్థ ప్రతినిధులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇప్పటికే అత్యుత్తమ ప్రమాణాలు పాటిస్తున్న టెంపుల్ గా యాదగిరిగుట్టకు ISO 9001:2015 సర్టిఫికేట్ లభించిందని గుర్తుచేశారు. మళ్లీ ఎంక్వైరీ చేసుకున్న ఐఎస్ఓ ప్రతినిధులు సేమ్ స్టాండర్డ్స్ పాటిస్తున్నారని నిర్ధారించుకుని ISO 9001:2015 సర్టిఫికేట్ ను రెన్యువల్ చేసి మళ్లీ సర్టిఫికేట్ ఇచ్చారని తెలిపారు. అదేవిధంగా దేవస్థాన ప్రసాద తయారీ, నాణ్యతా ప్రమాణాలు గుర్తించడమే కాకుండా.. భక్తులకు పవిత్రమైన ప్రసాదాన్ని భద్రంగా, పరిశుభ్రంగా అందిస్తున్నందుకుగానూ ISO 22000:2018 సర్టిఫికేట్ ను ఇచ్చారని చెప్పారు. ఒకే ఆలయానికి రెండు ఐఎస్ఓ సర్టిఫికేట్లు పొందిన ఏకైక ఆలయంగా దేవస్థానం గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హనుమంతరావు, ఆలయ ఈవో భాస్కర్ రావు, చైర్మన్ నరసింహమూర్తి తదితరులు ఉన్నారు.



